
సంపుటి :02 సంచిక :255 పేజీలు :07
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
బుధవారం 17, డిసెంబర్ 2025

## కార్యకర్తలను కాపాడుకుంటాం

- కంటికి రెప్పలా చూసుకుంటాం
- మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి..
- మీ సమస్యలు మాకు చెప్పవచ్చు
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధరరావు

05





జిల్లాల వారీగా పోలింగ్ (శాతంలో)

| | |
|---|---|
| వరంగల్ | 88.21 % |
| హనుమకొండ | 86.45 % |
| జనగాం | 88.48 % |
| ములుగు | 83.88 % |
| మహబూబాబాద్ | 88.53 % |
| భూపాలపల్లి | 84.02 % |

# ఆఖరి పోరు.. ఓటింగ్ జోరు

- మూడో విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం
- ఓటు వేసి అత్యధిక ఓటింగ్ నమోదు చేసిన ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో వెల్లివిరిసిన ఓటింగ్ చైతన్యం
- జిల్లాల్లో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 88.53% పోలింగ్
- మండలాల్లో అత్యధికంగా డోర్నకల్ మండలంలో 91.11 %
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- ఒంటిగంట వరకు కొనసాగిన ఓటింగ్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

02

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం మూడో విడత పంచాయతీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని చైతన్యాన్ని చాటారు. ఉదయం 7 గంటల నుంచి మొదలైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. ఒంటిగంటలోపు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నవారికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ ముగిసే సమయానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో ఓట్లు నమోదయ్యాయి. వరంగల్ జిల్లాలో 88.21 శాతం, హనుమకొండ జిల్లాలో 86.45 శాతం, జనగాం జిల్లాలో 88.48శాతం, ములుగు జిల్లాలో 83.88 శాతం, మహబూబాబాద్ జిల్లాలో 88.53 శాతం, భూపాలపల్లి జిల్లాలో 84.02 శాతం పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలైంది.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## ఆ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించలేదు !

05

ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్

ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు ఊరట

- రేపు పోచారం, కాలె యాదయ్య, సంజయ్‌కుమార్ పిటిషన్లపై తీర్పు
- ఇప్పటికీ విచారణకు హాజరుకాని కడియం, దానం నాగేందర్
- మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు



## అపాయింటెడ్ డే వాయిదా

06

ఈ నెల 20 నుంచి 22వ తేదీకి మార్పు

ఆ రోజు ప్రమాణ స్వీకారం చేయనున్న కొత్త సర్పంచులు

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు



# ఆఖరి పోరు.. ఓటింగ్ జోరు

- మూడో విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం
- ఓటు వేసి అత్యధిక ఓటింగ్ నమోదు చేసిన ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో వెల్లివిరిసిన ఓటింగ్ చైతన్యం
- జిల్లాల్లో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 88.53% పోలింగ్
- మండలాల్లో అత్యధికంగా డోర్నకల్ మండలంలో 91.11 %
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- ఒంటిగంట వరకు కొనసాగిన ఓటింగ్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం మూడో విడత పంచాయతీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని చైతన్యాన్ని చాటారు. ఉదయం 7 గంటల నుంచి మొదలైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. ఒంటిగంటలోపు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నవారికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ ముగిసే సమయానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో ఓట్లు నమోదయ్యాయి. వరంగల్ జిల్లాలో 88.21 శాతం, హనుమకొండ జిల్లాలో 86.45 శాతం, జనగాం జిల్లాలో 88.48శాతం, ములుగు జిల్లాలో 83.88 శాతం, మహబూబాబాద్ జిల్లాలో 88.53 శాతం, భూపాల పల్లి జిల్లాలో 84.02 శాతం పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలైంది.

### - వరంగల్ జిల్లా

వరంగల్ జిల్లాలో మొత్తం 1,24,555 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,09,870 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో 88.21 శాతం పోలింగ్ నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే చెన్నారావుపేటలో గరిష్ఠంగా 89.83 శాతం పోలింగ్ జరిగింది. అలాగే నెక్కొండ మండలంలో 87.52 శాతం, ఖానాపూర్ మండలంలో 87.75 శాతం ఓట్లు నమోదయ్యాయి. నర్సంపేట మండలంలో మాత్రం 37.84 శాతంతో తక్కువ పోలింగ్ నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

### - హనుమకొండ జిల్లా

హనుమకొండ జిల్లా పరిధిలో మొత్తం 1,11,341 మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 96,244 మంది ఓటు వేయగా, జిల్లాలో 86.45 శాతం పోలింగ్ నమోదైంది. దామెర మండలంలో అత్యధికంగా 89.58 శాతం ఓటింగ్ జరిగింది. ఆత్మకూరు మండలంలో 87.43 శాతం, శాయంపేట మండలంలో 84.74 శాతం మంది ఓటర్లు పాల్గొనగా, నడికూడ మండలంలో 85.00 శాతం పోలింగ్ నమోదైంది.

### - జనగాం జిల్లా

జనగాం జిల్లాలో మొత్తం 1,17,381 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ ముగిసే సమయానికి 1,03,860 మంది ఓటు వేశారు. జిల్లాలో మొత్తం పోలింగ్ శాతం 88.48గా నమోదైంది. దేవరుప్పుల మండలంలో అత్యధికంగా 90.10 శాతం మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. పాలకుర్తి మండలంలో 88.19 శాతం, కొడకండ్ల మండలంలో 86.92 శాతం పోలింగ్ జరిగింది.

### - ములుగు జిల్లా

ములుగు జిల్లాలోని మూడు మండలాల్లో కలిపి మొత్తం 53,918 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 45,228 మంది ఓటు వేయగా, జిల్లాలో 83.88 శాతం పోలింగ్ నమోదైంది. వాజేడు మండలంలో అత్యధికంగా 86.30 శాతం పోలింగ్ నమోదై ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబించింది. కన్నాయి గూడెం మండలంలో 82.87 శాతం, వెంకటా పురం మండలంలో 82.40 శాతం ఓటింగ్ జరిగింది.

### - మహబూబాబాద్ జిల్లా

మహబూబాబాద్ జిల్లాలో ఓటర్లు భారీ స్థాయిలో ఓటువేసి 88.52 శాతం ఓటింగ్ నమోదు చేశారు. జిల్లాలో మొత్తం 1,60,587 మంది ఓటర్లు ఉండగా, 1,42,153 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. డోర్నకల్ మండలంలో అత్యధికంగా 91.11 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. మరిపెడ మండలంలో 89.92 శాతం, సీరోలు మండలంలో 90.12 శాతం, కురవి మండలంలో 87.73 శాతం మంది ఓటర్లు ఓటు వేశారు. గంగారం మండలంలో 84.98 శాతం, కొత్తగూడ మండలంలో 83.41 శాతం పోలింగ్ నమోదైంది.

### - భూపాలపల్లి జిల్లా

భూపాలపల్లి జిల్లాలో మొత్తం 98,052 మంది ఓటర్లు ఉండగా, 82,382 మంది ఓటు వేశారు. జిల్లా వ్యాప్తంగా సగటున 84.02 శాతం పోలింగ్ నమోదైంది. మహదేవ్‌పూర్‌లో అత్యధికంగా 84.38 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహాముత్తారం మండలంలో 86.42 శాతం, కాటారం మండలంలో 82.28 శాతం, మల్హర్రా మండలంలో 83.80 శాతం పోలింగ్ నమోదైంది.

**జిల్లాల వారీగా పోలింగ్ (శాతంలో)**

| | |
|---|---|
| వరంగల్ | 88.21 |
| హనుమకొండ | 86.45 |
| జనగాం | 88.48 |
| ములుగు | 83.88 |
| మహబూబాబాద్ | 88.53 |
| భూపాలపల్లి | 84.02 |



**పోలింగ్ సరళి**

| జిల్లా | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు |
|---|---|---|
| వరంగల్ | 24,555 | 1,09,870 |
| హనుమకొండ | 1,11,341 | 96,244 |
| జనగాం | 1,17,381 | 1,03,860 |
| ములుగు | 53,918 | 45,228 |
| మహబూబాబాద్ | 1,60,587 | 1,42,153 |
| భూపాలపల్లి | 98,052 | 82,382 |




## పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

### * వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు విడతలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. ఈనెల 11 నుంచి బుధవారం వరకు మూడు విడతల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అభ్యర్థులు, ప్రజలతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు గాను డీసీపీ నుంచి హోంగార్డ్ స్థాయికి చెందిన వారు మొత్తం 2వేల మందికి పైగా పోలీసులు విధులు నిర్వహించారని, ఎన్నికల తేదీలు ఖరారైన నాటి నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠినంగా ఎన్నికల నిబంధనలను అమలు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కమిషనరేట్ పరిధిలో మొత్తం ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించడం జరిగిందని, అలాగే గ్రామాల్లోను ముమ్మరంగా తనిఖీ నిర్వహించడం ద్వారా నేటి వరకు 6లక్షల74వేల రూపాయలతో పాటు,128 కేసుల్లో సుమారు 12 లక్షల42 వేల రూపాయల విలువ గల మద్యం సీసాలు, 49 కేసుల్లో ఒక లక్ష 27వేల రూపాయల విలువగల 343 లీటర్ల గుడుంబాతో పాటు ఒక లక్ష 23వేల రూపాయల విలువ గంజాయిని పోలీసులు వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా లైసెన్స్ కలిగి వున్న మొత్తం 156 తుపాకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు, గతంలో ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి 432 కేసుల్లో మొత్తం 2,638 మందిని బైండోవర్ చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలిపారు.




## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: శాయంపేట, దామెర మండల కేంద్రాల్లోని గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. శాయంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. దామెర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వివరాలను ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డీఆర్డీఓ మేన శ్రీను, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, మండల ప్రత్యేకాధికారులు జయంతి, బాలరాజు, ఎంపీడీవోలు ఫణి చంద్ర, కల్పన, తహసిల్దార్లు ప్రవీణ్ కుమార్, జ్యోతి వరలక్ష్మిదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నర్సంపేట డివిజన్ లో

# ప్రశాంతంగా పోలింగ్




- ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు
- ఉత్సాహంగా ముందుకు వచ్చిన యువత
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ డా. సత్య శారద





అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట డివిజన్‌లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. మూడవ విడత పోలింగ్ సందర్భంగా బుధవారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద నర్సంపేట డివిజన్‌లోని పలు మండలాల్లో పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి, ఇటుకాలపల్లి; ఖానాపూర్ మండలంలోని ఖానాపూర్, రాగంపేట; చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి, తిమ్మరాయనిపహాడ్; నెక్కొండ మండలంలోని రెడ్లవాడ, ఆలంఖానిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలతో పాటు పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, సిబ్బంది విధుల నిర్వహణ, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణ కోసం సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన, అంతరాయం లేని వాతావరణం కల్పించడం సిబ్బందికి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, ఎన్నికల నిబంధనల ఖచ్చితమైన అమలు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఓటింగ్ శాతం పెంచే లక్ష్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఓటర్లలో ఆసక్తి పెరగడం వల్ల మొదటి, రెండవ విడతల్లో గ్రీన్ పోలింగ్ కేంద్రాల్లో సుమారు 3 శాతం పోలింగ్ అధికంగా నమోదైనట్లు తెలిపారు. ఈ విధానం వల్ల పోలింగ్ శాతం మరింత పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ విడతలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. నాలుగు మండలాల్లోని 110 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు, మొత్తం 282 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలకు గాను 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు. మిగతా పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రాఫర్లను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.





మొదటి విడతలో 86 శాతం, రెండవ విడతలో 88 శాతం పోలింగ్ నమోదు కావడంతో పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాలుగు మండలాల్లో మొత్తం 102 గ్రామపంచాయతీలు, 809 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహించామని, 7 గ్రామపంచాయతీలు, 137 వార్డులు ఏకగ్రీవం అయినట్లు వెల్లడించారు.

పోలింగ్ నిర్వహణకు సుమారు 4 వేల మంది సిబ్బందిని నియమించామని, ఇందులో 1,500 మంది పోలీస్ సిబ్బంది, 2,400 మంది పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు తదితర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో త్వరితగతిన ఫలితాలు వెల్లడించేలా అదనపు టేబుల్స్ ఏర్పాటు చేసి, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆర్వోలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మూడవ విడతలో 809 వార్డు స్థానాల కౌంటింగ్ ఫలితాలను వేగంగా ప్రకటించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్, కౌంటింగ్ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, ఆర్డీఓలు ఉమారాణి, సుమ, నోడల్ అధికారులు, ఎంపిడీవోలు, తహశీల్దార్లు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


















# ఘనంగా పెన్షనర్స్ డే..

## - కన్నుల పండువగా 75 వసంతాల వేడుక

అక్షరదర్బార్, హనుమకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ పెన్షనార్ధుల సన్మానోత్సవం పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. బుధవారం వడ్డేపల్లిలోని పల్లా రవీందర్ రెడ్డి స్మారక భవన్ లో రిటైర్డ్ సీజీఎం పెరుమాండ్ల మదన్ మోహన్ నేతృత్వంలో 75 వసంతాల వేడుక కన్నుల పండువగా జరిగింది. ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ పెన్షనర్స్ డే కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్డీ అండ్ ఐఆర్ డైరెక్టర్ సి.ప్రభాకర్, విద్యుత్ శాఖ పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు ఎ.మచ్చేంద్రయ్య, గడ్డం లక్ష్మీనారాయణ, ఎస్.వెంకట్ నరసయ్య, కె.రాజమౌళి, జి.వెంకటేశ్వర స్వామి, కె.అశోక్ రెడ్డి, బి.మొగిలయ్య, సీహెచ్.సమ్మయ్య, అరసం వీర మల్లయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, ఆడెపు రమణయ్య, కుమార స్వామి తదితరులతోపాటు డివిజన్ల బాధ్యులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్డీ అండ్ ఐఆర్ డైరెక్టర్ సి.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షన్ దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నప్పటికీ తనను నేరుగా కలవవచ్చన్నారు. పదవీ విరమణ పొందిన వారికోసం పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా 2026 హ్యాండ్ బుక్కును డైరెక్టర్ ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ వేడుకను పురస్కరించుకొని 32 మంది రిటైర్డ్ ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. నా భూతో.. నా భవిష్యత్ అన్న రీతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలతో పాటు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పెరుమాండ్ల మదన్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

### గడ్డం లక్ష్మీనారాయణకు ఘన సన్మానం..

విద్యుత్ శాఖలో మూడున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో పనిచేసి, ప్రస్తుతం పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లో కీలకంగా వ్యవహరిస్తున్న గడ్డం లక్ష్మీనారాయణతో పాటు ఆయన సతీమణి జయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. పెన్షనర్స్ డే సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్డీ అండ్ డైరెక్టర్ సి.ప్రభాకర్, పూర్వ సీజీఎం పెరుమాండ్ల మదన్మోహన్ తదితరులు వీరిని శాలువతో సత్కరించి, మెమొంటో అందజేశారు. విద్యుత్ శాఖలో ఎల్డీసీ స్థాయి నుంచి అకౌంట్ ఆఫీసర్ వరకు లక్ష్మీనారాయణ చేసిన సేవలను వీరు స్లాగించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నా రు.

# లక్నేపల్లి గ్రీన్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



అక్షర దర్బార్, నర్సంపేట : వరంగల్ జిల్లాలో జరుగుతున్న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట మండలం లక్నేపల్లి లో ఏర్పాటు చేసిన గ్రీన్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. పోలింగ్ వద్ద ఎలాంటి ఆటంకాలు జరుగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లక్నేపల్లి గ్రీన్ పోలింగ్ కేంద్రంలో గ్రీన్ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయగా ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకొన్న ఓటర్లు ఫొటోలు దిగారు.

# రసాయన శాస్త్రంలో పీహెచ్డీ పట్టా..

## బిల్లా నాయక్ తండ యువకుడి అరుదైన ఘనత



అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం బిల్లా నాయక్ తండకు చెందిన యువ పరిశోధకుడు మాలోతు రామ్మోహన్ రసాయన శాస్త్రంలో పీహెచ్డీని విజయవంతంగా పూర్తి చేసి గ్రామానికి ఆదర్శంగా నిలిచారు. క్యాన్సర్పై చేసిన పరిశోధనలో భాగంగా క్యాన్సర్ నిరోధక ఏజెంట్లుగా కొత్త థయాజోల్–టెట్రాహైడ్రోపైరిడిన్, నికోటినమైడ్, అలాగే థయాజోల్–టెట్రాహైడ్రోపైరిడిన్–పైరిడిన్ అనలాగ్‌ల రూపకల్పన, సంశ్లేషణ, మాలిక్యులర్ డాకింగ్‌పై చేసిన ఆయన పరిశోధన శాస్త్రీయ వర్గాల్లో ప్రశంసలు పొందుతోంది. ఈ పరిశోధనను ప్రొఫెసర్ గంగాధర్ థలారి మార్గదర్శకత్వంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని రసాయన శాస్త్ర విభాగంలో పూర్తి చేశారు. 2025 డిసెంబర్ 6న విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం వివిధ విభాగాలకు చెందిన పలువురు పరిశోధకులు పీహెచ్డీ డిగ్రీకి అర్హత సాధించారు. కుటుంబ సభ్యుల సహకారం, కృషి, పట్టుదలతో సాధించిన ఈ విజయం గ్రామీణ యువతకు ప్రేరణగా నిలుస్తోందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.




- రెండేళ్ల నుంచి గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు
- కొత్త సర్పంచ్ లు పరిష్కరిస్తారని ఆశిస్తున్న ప్రజలు
- సవాళ్ల నడుమ ప్రమాణ స్వీకారానికి సన్నద్ధం అవుతున్న సర్పంచులు

## కొత్త సర్పంచ్ లకు

# సమస్యల స్వాగతం

అక్షరదర్బార్, పరకాల: తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పరకాల మండలంలోని గ్రామాల్లో గెలిచిన నూతన సర్పంచులకు బాధ్యతలతో పాటు సమస్యల సవాళ్లు ఎదురవుతున్నాయి. గత రెండేళ్లుగా సర్పంచ్ ఎవరు లేకపోవడంతో గ్రామాల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ఇప్పుడు కొత్తగా ఎన్నికైన సర్పంచుల రాకతో ఆ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆయా గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సైడ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రోడ్లపై చెత్త పేరుకుపోయినా తొలగించేందుకు సిబ్బంది సహకారం అందకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో కొత్త సర్పంచులు పరిశుభ్రతపై అత్యవసర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామ సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో వాటిని తరిమివేయడానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్లు, పొదలను తొలగించి రహదారులను శుభ్రపరచాలన్న అభ్యర్థనలూ వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన అభివృద్ధి హామీలను అమలు చేయాలన్న అంశంపైనా ఆయా గ్రామస్తులు దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలకు కొత్త సర్పంచ్ లు పరిష్కారం చూపుతూ అభివృద్ధికి బాటలు వేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ సవాళ్లన్నింటిని ఎదుర్కొంటూ గ్రామాభివృద్ధికి ముందడుగు వేయనున్న సర్పంచులకు గ్రామ ప్రజలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నారు.

# ధర్మారం ప్రజలకు కృతజ్ఞతలు

## మీ నమ్మకాన్ని వమ్ము చేయను

## సర్పంచ్ భాషబోయిన ఎల్లస్వామి



అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం ధర్మారం గ్రామ సర్పంచ్‌గా విజయం సాధించిన భాష బోయిన ఎల్ల స్వామి గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరకాల ఎమ్మెల్యే అభివృద్ధి ప్రదాత రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచానని పేర్కొన్నారు. గ్రామంలోని కాంగ్రెస్ నాయకుల సహాయ సహకారాలు, ప్రజల ఆశీస్సుల వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ధర్మారం గ్రామ సేవకునిగా పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌గా భాష బోయిన ఎల్ల స్వామి గెలుపొందిన సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే జీఎస్సార్ పరామర్శ..

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం మాందారిపేట గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు దారంగుల పాణి విద్యుత్ షాక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వయంగా బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ ను మార్చాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

# పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

అక్షర దర్బార్, నర్సంపేట : రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత పోలింగ్ సందర్భంగా బుధవారం ఎన్నికల సాధారణ పరిశీలకురాలు శ్రీమతి బాల మాయాదేవి వివిధ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. నెక్కొండ మండలంలోని సాయి రెడ్డిపల్లి, పత్తిపాక, అమీన్‌పేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం చెన్నారావుపేట మండలంలోని తోపనగడ్డ తండా, లింగగిరి, జల్లి, తిమ్మరాయిని పహాడ్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఖానాపూర్ మండలంలోని బుద్ధరావుపేట, అశోక్‌నగర్ గ్రామాల్లో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన అబ్జర్వర్, నర్సంపేట మండలంలోని రాజుపేట, ఆకుల తండా, ఇటుకాలపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచ తప్పకుండా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జీఎం ఇండస్ట్రియల్ నరసింహ మూర్తి పాల్గొన్నారు.

# నడికూడలో కాంగ్రెస్ హవా..

## మూడో విడత ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యం

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలో మూడో విడతగా నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా స్పష్టంగా కనిపించింది. మండలంలో తొలి ఫలితంగా సర్వపూర్ గ్రామం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి భోగి శ్రీలత విజయం సాధించారు. ఇతర గ్రామాల్లో కౌకొండలో ఓదెల శ్రీలత (బిఆర్ఎస్), రామకృష్ణాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పెండ్లి లక్ష్మిరాజు, ధర్మారంలో కాంగ్రెస్ అభ్యర్థి బాషబోయిన ఎల్ల స్వామి, నడికూడలో కాంగ్రెస్ అభ్యర్థి మలహల్ రావు, రాయపర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి రాజా జగత్ ప్రకాష్, ముస్త్యాలపల్లిలో మ్యాకమల్ల వెంకటేష్ (బిఆర్ఎస్), చర్లపల్లిలో బండి రేణుక (బిఆర్ఎస్), నర్సక్క పల్లి గ్రామ సర్పంచ్ గా కోడెపాక ముత్యాలు (బిఆర్ఎస్), పులిగిల్ల గ్రామ సర్పంచ్ గా ఇనుగాల పద్మ ఐలోని (బిఆర్ఎస్) , వరికోల్ సర్పంచ్ గా దొగ్గల కుమార స్వామి (బిఆర్ఎస్), నార్లపూర్ గ్రామ సర్పంచ్ గా పేద్దబోయిన రవీందర్ యాదవ్ (కాంగ్రెస్) , చౌటుపర్తి గ్రామ సర్పంచ్ గా ఓదెల రూప (కాంగ్రెస్), కంటత్మకూర్ గ్రామ సర్పంచిగా కొంగటి తిరుపతి (కాంగ్రెస్) విజయం సాధించారు.

### ఓటు చోరీ ఆరోపణలతో ధర్నా..

ఇదిలా ఉండగా, నడికూడ మండలం వరికోల్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందర్భంగా మృతి చెందిన వారి ఓట్లను బిఆర్ఎస్ నాయకులు వేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నాదారులను తరలించడంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగింది.




ఇనుగాల పద్మ ఐలోని
పులిగిల్ల (బీఆర్ఎస్)


కొంగటి తిరుపతి
కంటాత్మకూరు (కాంగ్రెస్)


భాషబోయిన ఎల్లస్వామి
ధర్మారం (కాంగ్రెస్)


పెండ్లి లక్ష్మీరాజు
రామకృష్ణాపూర్ (కాంగ్రెస్)


పెద్దబోయిన రవీందర్ యాదవ్
నార్లపూర్ (కాంగ్రెస్)


దొగ్గల కుమారస్వామి
వరికోల్ (బీఆర్ఎస్)


మ్యాకమల్ల వెంకటేష్
ముస్త్యాలపల్లి (బీఆర్ఎస్)


భోగి శ్రీలత
సర్వపూర్ (కాంగ్రెస్)


ఓదెల రూప
చౌటుపర్తి (కాంగ్రెస్)


రాజా జగత్ ప్రకాష్
రాయపర్తి (కాంగ్రెస్)


కుడ్లే మలహల్ రావు
నడికూడ (కాంగ్రెస్)


ఓదెల శ్రీలత
కౌకొండ (బీఆర్ఎస్)


కోడెపాక ముత్యాలు
నర్సక్క పల్లి (బీఆర్ఎస్)


బండి రేణుక
చర్లపల్లి (బీఆర్ఎస్)

# ఆ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించలేదు!

- ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్
- ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు ఊరట
- రేపు పోచారం, కాలె యాదయ్య, సంజయ్ కుమార్ పిటిషన్లపై తీర్పు
- ఇప్పటికీ విచారణకు హాజరుకాని కడియం, దానం నాగేందర్
- మరింత సమయం కావాలని స్పీకర్ ను కోరిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : పార్టీ ఫిరాయింపులు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనర్హత పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీర్పు వెలువరించారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత వేటు పిటిషన్లపై ఉత్కంఠకు తెరపడింది. బీఆర్ఎస్‌కు చెందిన తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల) , గూడెం మహిపాల్‌రెడ్డి (పఠాన్‌చెరు) ప్రకాశ్‌గౌడ్ ( రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి ) పార్టీ మారినట్లు దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టి వేస్తూ స్పీకర్ ప్రసాద్‌కుమార్ బుధవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు చూపలేకపోయారని తీర్పులో పేర్కొన్నారు. అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు స్పీకర్ తన తీర్పులో స్పష్టం చేశారు. దీంతో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు పెద్ద ఊరటనే లభించింది.

### - బీఆర్ఎస్ నుంచి గెలుపు

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు చేరారని, వారిపై బీఆర్ఎస్ పార్టీ అనర్హత పిటిషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేశారు. ఇంకా దానం నాగేందర్ ( ఖైరతాబాద్ ) , కడియం శ్రీహరి ( స్టేషన్‌ఘన్‌పూర్) పై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ పూర్తి కాలేదు. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు విచారణకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరారు. అయితే అనర్హత పిటిషన్లపై సభాపతి త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ గతంలోనే సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. సుప్రీంకోర్టులో అనర్హత పిటిషన్‌పై విచారణ అనంతరం ఈ నెల 19 తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో సుప్రీంకోర్టు సూచనల మేరకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తి చేశారు. వారు పార్టీ మారినట్లుగా ఆధారాలేవని ఇప్పుడు ఐదుగురు ఎమ్మెల్యేలు సంబంధించి తీర్పు ఇచ్చారు. ఇక గురువారం మరో ముగ్గురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య , సంజయ్‌కుమార్‌కు సంబంధించిన తీర్పు వెలువడనుంది.

### - దానం, కడియం తీర్పుపై ఉత్కంఠ

ఇంకా విచారణకు హాజరుకాని ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఉత్కంఠంగా మారింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పాటు .. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఇక స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతరు కడియం కావ్య వరంగల్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. కడియం శ్రీహరి మాత్రం తన కూతురు కడియం కావ్య కోసం కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించన సభల్లోనూ పాల్గొన్నారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం కాంగ్రెస్ కండువాతో పాటు ఆ పార్టీ సభల్లోను పాల్గొన్నట్లుగా పూర్తి ఆధారాలున్నాయని, వారిపై కచ్చితంగా వేటు పడుతుందనే వాదన కూడా వినిపిస్తోంది.



# లక్నేపల్లి సర్పంచ్ రికార్డు స్థాయి గెలుపు

## అభ్యర్థి ఐలోని రజిత అశోక్

నర్సంపేట,అక్షర దర్బార్ : నర్సంపేట రూరల్ మండలం లక్నేపల్లి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ఐలోని రజిత అశోక్ 655 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించి రికార్డ్ సృష్టించింది. మొత్తం 1640 ఓట్లు పోల్ కాగా ఐలోని రచిత అశోక్ కు 1145 రాగా, ప్రత్యర్థికి 495 ఓట్లు వచ్చాయి. దీంతో 650 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు అధికారులు ధ్రువీకరించారు.



# కార్యకర్తలను కాపాడుకుంటాం

- కంటికి రెప్పలా చూసుకుంటాం
- మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి..
- మీ సమస్యలు మాకు చెప్పవచ్చు
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధరరావు

అక్షరదర్బార్, వరంగల్: ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు భరోసానిచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓసిటీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజలు క్యాంప్ ఆఫీస్ చేరుకుని తమ సమస్యలను విన్నవించారు. వారి సాధక బాధకాలను సహృదయంతో విని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా తనను నిర్భయంగా సంప్రదించవచ్చని ప్రజలకు స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వాలు మారిన ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని భుజాన పార్టీ జెండా మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి కార్యకర్తలకు సరైన గుర్తింపు వచ్చేలా వారికి కావలసిన పదవులను దక్కేలా చేస్తానని తెలిపారు. అందరం కలిసి మెలిసి ఉండాలని ఐక్యమత్యం చాటాలన్నారు. కార్యకర్తలకు నాయకులకు పార్టీ పరంగా గౌరవ మర్యాదలు దక్కే విధంగా తాను పాటు పడతానన్నారు. ఎలాంటి ఆపద సమయాల్లోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని భరోసానిచ్చారు.

# 86.45 శాతం పోలింగ్ నమోదు

*** హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్**

అక్షరదర్బార్, హనుమకొండ: గ్రామపంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ హనుమకొండ జిల్లాలోని నాలుగు మండలాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు. జిల్లాలో మూడో విడత ఎన్నికలలో భాగంగా ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరిగిందని పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో పోలింగ్ శాతం 86.45 నమోదైయ్యింది. ఆయా మండలాల పరిధిలో ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటవరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ కేంద్రాలలో సర్పంచ్, వార్డు స్థానాలకు పోలైన ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను ఎన్నికల అధికారులు మొదలుపెట్టారు. వార్డులు, సర్పంచ్ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ఎన్నికల అధికారులు వెల్లడించారు.

## మండలాల వారీగా పోలైన ఓట్లు

ఆత్మకూర్ మండలంలో 24844 ఓట్లు పోల్ కాగా 87.43 పోలింగ్ శాతం నమోదయ్యింది. దామెర మండలంలో 19602 ఓట్లు పోల్ కాగా 89.58 పోలింగ్ శాతం, నడికూడ మండలంలో 23362 ఓట్లు పోల్ కాగా 85 పోలింగ్ శాతం, శాయంపేట మండలంలో 28436 ఓట్లు పోల్ కాగా 84.74 పోలింగ్ శాతం నమోదయింది. ఈ నాలుగు మండలాల్లో మొత్తం 96244 ఓట్లు పోల్ కాగా 86.45 పోలింగ్ శాతం నమోదైయ్యింది.

## మూడు విడతలు ప్రశాంతం

గ్రామపంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించగా జిల్లాలో మూడు దశలు ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మొదటి విడత ఎన్నికలు ఈ నెల 11వ తేదీన, 14న రెండో విడత ఎన్నికలు జరిగాయి. గ్రామపంచాయతీలకు మూడో విడత ఎన్నికలు బుధవారం (17వ తేదీన )జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రశాంతంగా ముగిశాయి. హనుమకొండ జిల్లాలో తొలి విడత లో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగగా, రెండో విడతలో ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో ఎన్నికలు జరిగాయి. మూడో విడతలో జిల్లాలోని ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాలకు సంబంధించిన గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.





# మున్నూరు కాపు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని**

అక్షరదర్బార్, హనుమకొండ: మున్నూరు కాపుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పదేళ్లుగా కేవలం శంకుస్థాపనలకే పరిమితమైన ఈ భవనాన్ని, తమ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. భవన నిర్మాణానికి తొలుత ఐదు కోట్ల రూపాయల అంచనా వ్యయం ఉండగా, దానిని రూ.7 కోట్లకు పెంచి నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఆధునిక సౌకర్యాలతో ఈ భవనాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. జిల్లాలోని మున్నూరు కాపు సోదరులకు ఈ భవనం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కమిటీ కన్వీనర్గా ఈవీ శ్రీనివాస్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన కుల బాంధవులకు, సహకరించిన ముఖ్యమంత్రికి మరియు ఎమ్మెల్యే నాయినికి శ్రీనివాస్ రావు కృతజ్ఞతలు తెలిపారు. భవనాన్ని నాణ్యతతో, పారదర్శకంగా మరియు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తమ కమ్యూనిటీకి గతంలో సరైన ప్రాధాన్యత దక్కలేదని, ఇప్పుడు ఎమ్మెల్యే చొరవతో భవన నిర్మాణం ముందుకు సాగడం సంతోషంగా ఉందని కుల బాంధవులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంద ఐలయ్య, కటకం పెంటయ్య, గైనేని రాజన్, కోరబోయిన సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రాలను సందర్శించిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం జరిగిన గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికలకు సంబంధించి పలు గ్రామపంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ జనగామ జిల్లాలోని, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లతో పాటు ఎన్నికలు జరుగుతున్న తీరుతెన్నులపై పోలీసు కమిషనర్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కమిషనర్ అధికారులకు పలు సూచన సలహాలు అందజేశారు. సీపీ వెంట వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీ రవి, ఏసీపీ నర్సయ్య, ఇన్ స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఓటేసి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

అక్షర దర్బార్, ములుగు : పంచాయతీ ఎన్నికల్లో ఓటేసి వెళ్తుండగా కారు పల్టీ కొట్టి మహిళ మృతి చెందిన ఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ మండల పరిధిలో బుధవారం జరిగింది. భూపాలపల్లి సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న నర్సంపేట మండలం గురిజాలకు చెందిన అల్వాల దేవేందర్–అపర్ణ దంపతులు కారులో స్వగ్రామానికి వచ్చి బుధవారం ఉదయం ఓటు హక్కు వినియోగించుకొని తిరిగి భూపాలపల్లికి బయలుదేరారు. మార్గమధ్యలో వెంకటాపూర్ వద్ద మూలమలుపు వద్ద కారు ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో అపర్ణ అక్కడికక్కడే మరణించగా దేవేందర్ గాయపడ్డాడు.

# కాళేశ్వరం సర్పంచ్ గా మోహన్ రెడ్డి

అక్షరదర్బార్, కాళేశ్వరం: పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లా మహదేవ్పూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలో నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. ఈ గ్రామంలో సర్పంచ్ పదవిని గెలుచుకోవడాన్ని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా భావించడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో బుధవారం జరిగిన పోలింగ్లో కాళేశ్వరం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని బీఆర్ఎస్ మద్దతుదారుడైన వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి కైవసం చేసుకున్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

అక్షర దర్పర్, ములుగు జిల్లా ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" మరియు ఆరు వారాల సైబర్ అవగాహన కాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో సైబర్ నేరాలపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేసి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యక్తిగత సమాచారాన్ని ముఖ్యంగా పాస్వర్డ్లు, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు వంటి కీలక సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అపరిచిత లింక్లపై క్లిక్ చేయకూడదని, ఫోన్ ద్వారా వచ్చే అనుమానాస్పద అటాచ్మెంట్లను తెరవవద్దని తెలిపారు. డిజిటల్ అరెస్ట్, బెదిరింపుల వంటి కాల్స్కు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. డబ్బును బదిలీ చేయమని లేదా నగదు తీసుకుని ఇవ్వమని కోరే అభ్యర్థనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని కలెక్టర్ హెచ్చరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైనట్లు అనిపిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్కు, www.cybercrime.gov.in వెబ్సైట్లో లేదా సమీప క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జి, జిల్లా పౌర సంబంధాల అధికారి రఫిక్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



# అపాయింటెడ్ డే వాయిదా

- ఈ నెల 20 నుంచి 22వ తేదీకి మార్పు
- ఆ రోజు ప్రమాణ స్వీకారం చేయనున్న కొత్త సర్పంచులు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లతో ఈ నెల 20న ప్రమాణ స్వీకారం చేయాలని యంత్రాంగం నిర్ణయించింది. అనుకోని కారణాలతో ఈ కార్యక్రమం వాయిదా పడింది. ప్రమాణ స్వీకార తేదీని డిసెంబర్ 22వ తేదీకి మార్చారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ శ్రీజన బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 20న పదవీ బాధ్యతలు చేపట్టాల్సి ఉండగా.. సరైన ముహూర్తాలు లేవని, ఆ రోజు బాధ్యతలు స్వీకరించడం మంచిది కాదని భావించిన పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో నూతన సర్పంచుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న పంచాయతీ రాజ్ శాఖ సానుకూలంగా స్పందించింది. బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని రెండు రోజులు వెనక్కి జరిపి డిసెంబర్ 22న నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో అదే రోజున నూతన సర్పంచులు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, నూతన పాలకవర్గాలతో ప్రమాణస్వీకారం చేయించాలని ఉన్నతాధికారులు ఇప్పటికే జిల్లాల కలెక్టర్లకు, పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్
విప్లవంలో
భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం
QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా
వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915